క్లుప్తంగా

ఆస్తిపన్ను పెనాల్టీపై 90 శాతం రాయితీ

నారాయణపేట టౌన్: నారాయణపేట పట్టణ పురపాలిక పరిధిలో ఆస్తిపన్ను బకాయిదారుల కు ప్రభుత్వం మంచి వెసులుబాటు కల్పించిందని పురపాలిక కమిషనర్ భోగేశ్వర్లు అన్నారు. 90 శాతం వడ్డీ మాఫీతో మొత్తం ఒకే సారి పన్ను బకాయిలు చెల్లించేలా వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద ఆస్తిపన్ను పెనాల్టీపై 90 శాతం రాయితీ ప్రకటించామన్నారు. ఈ అవకావం మార్చి 31 సాయంత్రం వరకు ఉంటుందన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో డప్పు చప్పుళ్లతో మేనేజర్ మల్లికార్జున్, పలువురు వార్డు ఆఫీసర్లతో కలిసి కమిషనర్ భోగేశ్వర్లు వీధులలో ప్రచారయాత్ర ప్రారంభించారు. మొండి బకాయిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

కృష్ణా: మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే కోతలు ప్రారంభం కావడంతో ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని బీజేపీ నియోకవర్గ నాయకుడు బల్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోతలు పూర్తి అయిన రైతులు గన్నీ బ్యాగులు లేక, కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ఇథనాల్ కంపెనీ ఎదుట లారీ డ్రైవర్ల ఆందోళన



మరికల్: జూరాల ఇథనాల్ కంపెనీకి వచ్చిన లారీల్లో సరుకులు అన్‌లోడు చేయడం లేదని బుధవారం కంపెనీ ఎదుట లారీ డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ఇతర ప్రాంతాల నుంచి మొక్కజొన్న, బియ్యం, తదితర సరుకులతో కూడిన వందల సంఖ్యలో లారీలు కంపెనీ దగ్గరకు వచ్చాయి. వచ్చి వారం రోజులు గడుస్తున్నా అన్‌లోడు చేయకపోవడంతో లారీల దగ్గరే తిండి తిప్పలు వదిలేసి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ డ్రైవర్లకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. వెంటనే లారీలను అన్‌లోడు చేయాలని వారు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ఐమాస్ట్ వీధి దీపాలు ప్రారంభం



కొత్తపల్లి: కొడంగల్ నియోజక వర్గంలోని కొత్తపల్లి మండల కేంద్రంలో బుధవారం సౌర యంత్రం ఐమాస్ట్ వీధి దీపాలను మాజీ ఎంపీటీసీ అనిత ప్రారంభించారు. రూ.5 లక్షలతో గ్రామంలోని మైసమ్మ కూడలి, వీరమ్మ దేవాలయ కూడలిలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పార్థివగౌడ్, నీలా రెడ్డి, మన్నాపూర్ శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, లింగం, వెంకటయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి



మక్తల్: మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మక్తల్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. బుధవారం మక్తల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ప్రజలకు అందేలా కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో చేసే అభివృద్ధి పనులను ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, కట్టసురేష్, శ్రీనివాసులు, నర్సింహులు, పయాజ్, గోవర్ధన్, రవికుమార్, నాగరాజు పాల్గొన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్డు



మాగనూర్: మండల కేంద్రం నుంచి మందిపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మార్గంలో చాలా చోట్ల కంకర తేలి, గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రయాణికులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి, బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

వైద్యానికి తప్పని ఎదురుచూపులు

- పశువైద్యశాల ఎప్పుడు తెరుస్తారో..
- చేయి తడపనిదే వైద్యం అందదు..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు



మూసి ఉన్న హిందుపూర్‌లోని పశువైద్యశాల



డాక్టర్ కోసం ఎదురుచూస్తున్న రైతు

కృష్ణా: వేసవి కాలం, అందులో మూగ జీవులకు పలు రోగాలు ప్రబలే సమయం. అత్యవసర సమయంలో పశువులను కాపాడుకోవడానికి రైతులు ఆగమేఘాల మీద పశువైద్యశాలకు పరుగులు పెడతారు. తీర వైద్యశాలకు రాగానే తెరుచుకోని తలుపులు దర్శనమిస్తున్నాయి. దీంతో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతంగా ఉంటున్నాయని చెప్పొచ్చు. ఇలా చాలా ఏళ్లుగా కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా మండలానికి ఉన్న ఏకైక పశువైద్యశాల హిందుపూర్ వైద్యశాల. ఈ ఆస్పత్రి పరిధిలోకి మండలంలోని 13 గ్రామాలొస్తాయి. ఈ పశువైద్యశాల ఎప్పుడు తెరుస్తారో తెలియదు, డాక్టర్లు ఎప్పుడొస్తారో తెలియదు. వైద్యశాలలో ఉండే కంపౌండరే రైతుల పాలిట వైద్యుడు. ఆయనకు ఇంతో అంతో చేయి తడపనిదే పశువులకు వైద్యం అందదు. రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందించే మందులకు ఓ రేటు, ఇక ఆయన ఏ గ్రామానికి వెళ్లిన పెట్రోల్ చార్జీ, తన చార్జీ ఇవ్వాల్సిందే. డబ్బులు ఇచ్చినా సమయానికి కూడా రావడం లేదు. అత్యవసర సమయంలో సమయానికి వైద్యం అందక పశువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. పశువులకు తక్షణమే వైద్యం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కంపౌండరే వైద్యుడు..

హిందుపూర్ పశువైద్యశాలలో డాక్టర్ లేకపోవడం వల్ల కంపౌండరే పశువులకు వైద్యం అందిస్తాడు. ఏ గ్రామంలో పశువులకు వైద్యం అందించాలన్నా వెళ్లడానికి కంపౌండే దిక్కు. నదీతీర ప్రాంతంలో రైతులు పాడి పశువులు పంచుతారు. అక్కడికి వెళ్లి వైద్యం చేయాలంటే కంపౌండర్ చేయి తడపనిదే పని ముందుకు సాగదు. పశువుల ఆస్పత్రి సరైన సమయంలో తెరిచి ఉంచాలని, రైతుల నుంచి డబ్బులు వసూలు చేయకుండా అరికట్టాలని హిందుపూర్ గ్రామ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ముంపు గ్రామాలకు భరోసా కల్పించాలి

- మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: మక్తల్ నియోజకవర్గంలోని ముంపు గ్రామాల ప్రజలకు భరోసా కల్పించాలని బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో మక్తల్ ఎమెల్యే వాకిటి శ్రీహరి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మక్తల్–నారాయణపేట–కొడగంల్ ఎత్తిపోతల కింద భూములు కోల్పోతున్న రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జూరాల బ్యాక్ వాటర్ కింద ముంపునకు గురైన గ్రామాలు అంకేన్‌పల్లి, దాదాన్‌పల్లి, గడ్డంపల్లి, అనుగొండ గ్రామాలకు దాదాపు 20 ఏళ్ల నుంచి సమస్యలు పరిష్కారం చేయలేదన్నారు. సంగంబండ, భూత్పూర్ గ్రామాల కింద ఉజ్జెల్లి, గార్లపల్లి, నేరడుగోమ్, భూత్పూర్ గ్రామాల సమస్యలు ఇప్పటి వరకు పరిష్కారం చేయలేదని, నిర్వాసితులను ఆదుకోవడం లేదన్నారు. పరిహారం అందలేదని, ఆర్‌ఆర్ సెంటర్లను ఏర్పాటు చేయలేదన్నారు. తక్షణమే వారిని ఆదుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఆదుకోవడం జరుగుతుందని, నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటారని అసెంబ్లీలో ప్రస్తావించారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం



మక్తల్‌లో ఇఫ్తార్‌లో పాల్గొన్న అధికారులు, ముస్లింలు



ఇఫ్తార్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మక్తల్/ కోస్గి రూరల్: రంజాన్ పండుగ సందర్భంగా బుధవారం మక్తల్ పట్టణంలో రాయల్ ఫంక్షన్ హాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సతీష్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మక్తల్ సీఐ రాంలాల్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, జుబేర్‌పాష, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, కట్టసురేష్, కట్ట వెంకటేష్, గోవర్ధన్, శంషొద్దీన్, పయాజ, నూరొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

- కోస్గి మండలం తాండూర్ రోడ్డులోని అయేషామసీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఇందులో తహసీల్దార్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నరేందర్, ఇద్రీస్, ఆసీఫ్, ఇజాజ్ ఉన్నారు.

ఇఫ్తార్‌లో మాజీ ఎమ్మెల్యే

మరికల్: మండల కేంద్రంలో ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. రంజాన్ సందర్భంగా మసీదులో ప్రార్థనలు ముగించిన అనంతరం వారితో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సురేఖ, తిరుపతయ్య, బసంత్, రామస్వామి, రాజవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మతిన్, జగదీశ్, నారాయణ, రఘు, విష్ణుకాంత్‌రెడ్డి, ప్రకాశ్‌శెట్టి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్

దామరగిద్ద: చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే చట్టాల ద్వారా న్యాయాన్ని పొందేందుకు అవకాశం ఉంటుందని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని క్యాతన్‌పల్లి, బాపన్‌పల్లి గ్రామాల్లో జిల్లా న్యాయ సేవా సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు చట్టాలు సమాజంలో బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలు పొందేందుకు 1987 చట్ట పరమైన న్యాయసేవల న్యాయ సేవల అథారిటీ (ఎన్‌ఏఎల్‌ఎస్‌ఏ) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిఫెన్స్ కౌన్సిల్ సీనియర్ అడ్వకేట్ కాళప్ప మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు ఉంటాయని తెలిపారు. చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే హక్కులను నిర్భయంగా పొందుతారన్నారు. చట్టం దృష్టిలో పేద, ధనిక తేడా లేదని, పౌరులందరు సమానమేనని గుర్తు చేశారు. రైతులు వ్యవసాయ అనుబంధ రంగాలను ఎంచుకోవాలని, సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సాధించాలని కోరారు. రైతులు ఎరువుల, పురుగు మందుల కొనుగోలుతో పాటు వ్యవసాయానికి సంబంధించి ఏది కొనుగోలు చేసినా రశీదు తప్పకుండా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ గోపాల్, పంచాయతీ కార్యదర్శి బిందు, శ్వేత, గ్రామస్తులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం

మక్తల్: మక్తల్ మున్సిపాలిటీలో బుధవారం 2025–2026 సంవత్సరానికి తైబజార్ బహిరంగ వేలం నిర్వహించారు. తైబజార్ వేలంలో మక్తల్‌కు చెందిన రాము, వెంకటేష్‌లు పాల్గొన్నారు. రూ.14.57 లక్షలు రాము పాడగా, వెంకటేష్ రూ.14.58లక్షలు పాడారు. దీంతో వెంకటేష్‌కు దక్కిందని కమిషనర్ శంకర్‌నాయక్ తెలిపారు.

కొండాపూర్‌లో..

ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌లో ప్రతి మంగళవారం నిర్వహించే సంత కోసం తైబజారు వేలం బుధవారం పంచాయతీ అధికారులు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిబంధనలకు అనుగుణంగా తైబజారు బహిరంగ వేలంలో గ్రామానికి చెందిన చంద్రారెడ్డి రూ.63,500లకు దక్కించుకున్నారు. వచ్చే సంవత్సరం వరకు తైబజారు వసూళ్లు చంద్రారెడ్డికి ఉంటుందని పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు.

వాతావరణ మార్పులపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

దామరగిద్ద: వేసవి ఎండలు పెరుగుతుండటంతో వాతావరణ మార్పులతో జరిగే పరిణామాలపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కల్పించారు. జాతీయ వాతావరణ మార్పులు మానవ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రాథమిక వైద్యాధికారి సేదేష్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి ఎండలు పెరుగుతుండటంతో వడదెబ్బ, డీ హైడ్రేషన్, వంటి సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు పాటించేలా చేయాలన్నారు. అత్యవసర పరిస్థితిలో 108కు ఫోన్ చేసి వైద్యసేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ఉదయ్‌శంకర్, నారాయణ, వెంకటేష్, కిష్టమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీచర్లు సమయ పాలన పాటించాలి



ఊట్కూరు: అంగన్‌వాడీ టీచర్లు సమయ పాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజలి కోరారు. బుధవారం మండలంలోని పగిడిమారి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాలలో రికార్డులను, పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రేణుక, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వడగండ్ల వానకు దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

మద్దూరు: మండలంలోని నందిపాడ్, పల్లెర్ల, జాదరావ్‌పల్లి గ్రామాల్లో సోమవారం కురిసిన వడగండ్ల వానకు వరి, కీరదోశ, మామిడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ. 50 వేలు చెల్లించాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం నాయకుడు డిమాండ్ చేశారు. బుధవారం పంట నష్టపోయిన ఈ గ్రామాల్లో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, సంఘం నాయకులతో కలిసి పంటలను పరిశీలించారు. 15 రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో వడగండ్ల వర్షం కురవడంతో పంటంతా భూమి పాలైయిందన్నారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలన్నా రు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బండమీది రాములు, కొండ నర్సింహులు, నారాయ ణ, గొల్ల గంగప్ప, మహిపాల్, రాజు, గుండప్ప, మదరప్ప, మొగులప్ప, చెన్నప్ప, పీర్‌సాబ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కరువు



కొత్తపల్లి: మండలంలో కొనసాగుతున్న ప్రధాన రహదారులు, బ్రిడ్జీలు, కల్వర్టులు, సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. నాణ్యత లోపించి ప్రభుత్వ సొమ్ము వృథా అవుతోంది. మండలంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

‘అపార్’ వేగవంతం చేయాలి

కోస్గి రూరల్: ఆధార్ తరహాలో విద్యార్థుల కోసం ప్రత్యేక గుర్తింపు కార్డు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తులో భాగంగా అపార్ వివరాలు వేగవంతంగా పూర్తి చేయాలని మండల విద్యాధికారి శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని సంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి అపార్ నమోదు వివరాలను పరిశీలించారు. తప్పులు సరి చేస్తూ మార్పులు చేసే సమయంలో తల్లిదండ్రుల ధ్రువీకరణ తప్పకుండా తీసుకోవాలని, అడ్మిషన్ రిజిస్టర్‌లో మార్పులు చేసిన చోట ప్రధానోపాధ్యాయుల సంతకం చేయాలని సూచించారు. వన్ నేషన్ వన్ ఐడీ పేరుతో 17 అంకెలు గల గుర్తింపు నెంబర్ విద్యార్థులందరికి అందేలా 100 శాతం నమోదు చేయాల్సి ఉందన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయరాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ పాటిద్దాం



కోస్గి హెచ్‌ఎం వెంకటేశ్వరికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంఈఓ శంకర్‌నాయక్

కోస్గి రూరల్: జీవుల మనుగడలో కీలకపాత్ర వహించే నీటిని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరు అలవాటుగా మార్చుకోవాలని బుధవారం వాక్ ఫర్ వాటర్ ప్రతినిధి వీరమల్లేశం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవం సందర్భంగా వాక్ ఫర్ వాటర్ సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు నీటిని సంరక్షించుకుందామని ప్రతిజ్ఞ చేసిన నీటి సంరక్షకులు, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరికి ప్రశంసా పత్రం అందజేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి భావితరాల్లో ఆలోచన బీజాలు నాటించిన ఉపాధ్యాయ బృందానికి మండల విద్యాధికారి శంకర్‌నాయక్ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాములు, నాగరాజు, తదితరులు ఉన్నారు.

‘పీఎం శ్రీ’ పాఠశాలల పరిశీలన



కోస్గి బాలుర ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ శంకర్‌నాయక్

కోస్గి రూరల్: మండలంలోని పీఎంశ్రీ పాఠశాలల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకున్న పాఠశాలలను బుధవారం మండల విద్యాధికారి శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఎంపిక కమిటీ పరిశీలిచింది. సంబంధిత పాఠశాలలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలు, వాస్తవ పరిస్థితులను పోల్చి చూశారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్య, విద్యుత్ సౌకర్యం, పీఎం పోషణ పథకం అమలు, కిచెన్ గార్డెన్, భౌతిక వసతులు, తల్లిదండ్రుల సమావేశాల నిర్వాహణ, బోధనోపకరణాల వినియోగం, జాతీయ స్థాయిలో సాధించిన అవార్డులు, వంటి వివరాలు ప్రత్యక్షంగా పరిశీలించి ధ్రువీకరించారు. ఈ బృందంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు శేఖరయ్య, సైన్స్‌టీచర్ వార్ల మల్లేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ కేటాయించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వెనుకబడిన పాలమూరు జిల్లాలో కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీని మంజూరు చేస్తే పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పీయూలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వాటికి నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందన్నారు. ఈ క్రమంలో వాటి అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటే బాగుటుందని తెలిపారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ యూజీసీ ప్రైవేట్ డీమ్డ్ యూనివర్సిటీలకు అనుమతి ఇవ్వడంతో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిపోయిందని, యూనివర్సిటీలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధ్యాపకులు కుమారస్వామి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, విజయ్‌కన్నా, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, కార్యదర్శి సాయికృష్ణ, వెంకటేష్, కావ్య, రేణుక, రజిత పాల్గొన్నారు.

జూన్ 2 వరకు ఏకరూప దుస్తులు అందించాలి



మహిళలకు గుడ్డను అందజేస్తున్న ఎంఈఓ బాలకిష్టప్ప

మద్దూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను జూన్ 2 వరకు అందజేయాలని మహిళలకు ఎంఈఓ బాలకిష్టప్ప సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో 44 పాఠశాలల హెచ్‌ఎంలు, దుస్తులు కుట్టే మహిళలతో సమావేశం నిర్వహించారు. గడువులోగా ఏకరూప దుస్తులను కుట్టి పాఠశాల హెచ్‌ఎంలకు అందజేయాలన్నారు. ఈ పాఠశాలల్లో 2,114 మంది బాలురు, 2,637 మంది బాలికలకు దుస్తులు కుట్టాలన్నారు. మహిళలకు ఎమ్మార్సీ కార్యాలయంలో గుడ్డను ఐకేపీ ఏపీఎం నారాయణతో కలిసి పంపిణీ చేశారు.

రైతులకు రుణాలు సకాలంలో అందించాలి



పీఏసీఎస్ సమావేశానికి హాజరైన డైరెక్టర్లు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని రైతులందరికి సహకార సంఘం ద్వారా ఎరువులు, రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సహకార సంఘం డైరెక్టర్లు తీర్మానించారు. బుధవారం మద్దూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ నర్సింహ అధ్యక్షతన డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. బ్యాంకు ద్వారా రైతులకు ఇచ్చిన రుణాలు, యూరి యా సరఫరాపై కార్యదర్శి భాస్కర్ డైరెక్టర్లకు వివరించారు. వైస్ చైర్మన్ ఆంజనేయులు, డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, పాపిరెడ్డి, బిక్యానాయక్, రాంచందర్, వెంకట్‌రాములు, లలితమ్మ, బాలమ్మ ఉన్నారు.

ప్రభుత్వ లక్ష్యం నిర్వీర్యం



మాగనూర్: పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం లక్ష్యం తగలబడిపోతోంది. ఒకవైపు భారీ సంఖ్యలో మొక్కలు నాటుతుంటే, మరోవైపు కొందరు చెట్లను నరకడం, తగలబెట్టడం వంటి పనులతో ప్రభుత్వ లక్ష్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారు. మాగనూర్ మండలంలోని తళంకేరి గ్రామ ప్రధాన రహదారి పక్కన పంట వ్యర్థాలను తగుల బెట్టడంతో హరితహారంలో నాటిన చెట్లకు నిప్పులు తగిలి కాలిపోతున్నాయి. అధికారులు స్పందించి ఇలాంటివి జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్ని హరితహారం మొక్కలను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ఆత్మకూర్: స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది జీకే రాములు, ప్రధానకార్యదర్శిగా ముక్తేశ్వర్, ఉపాధ్యక్షులుగా దివాన్జీ అశోక్‌కుమార్, ఏపీ రాజేందర్, సహాయకార్యదర్శిగా అబ్రహం, కోశాధికారిగా రాంచందర్, గేమ్స్ సెక్రెటరీగా రవీందర్‌రెడ్డి, లైబ్రరీ సెక్రెటరీగా అశోక్‌కుమార్‌గౌడ్‌ను నియమించారు. ఎన్నికల అధికారులుగా శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌లింగం, సలహాదారులుగా సీనియర్ న్యాయవాదులు వై తిప్పారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, నారాయణగౌడ్ వ్యవహరించారు.